AIJRELPLS VOLUME 7, ISSUE 1 (2022, JAN/FEB) (ISSN-2456-3897)ONLINE
Anveshana's International Journal Of Research In Education, Literature, Psychology And Library Sciences

# తెలంగాణ ప్రజల జీవితాలను చిత్రించిన నాటకం - ముందడుగు నాటకం

డా॥బోనాల మురళి,
అధ్యాపకుడు, తెలుగు శాఖ,
యూనివర్సిటి పి.జి. కళాశాల,
ఉస్మానియా విశ్వవిద్యాలయం, సికింద్రాబాద్.

ఆధునిక సాంఘీక నాటక రంగంలో విశిష్టమైన స్థానాన్ని సంపాదించుకున్న రచయితలు వాసిరెడ్డి భాస్కరరావు, సుంకర సత్యనారాయణ ..వీరు రచించిన ముందడుగు నాటకం నాటి సమాజంలోని తెలంగాణ ప్రజల బతుకు చిత్రాన్ని చిత్రీకరించిన తీరు అమోఘం. 1946లో వచ్చిన నాటకం ముందడుగు. తెలంగాణ ప్రాంతంలోని భూస్వామ్య విధానం, జమీందారి వ్యవస్థ అమలులో ఉన్న సంధ్భరంలో ఈ నాటకం వచ్చింది. ఈ నాటకం ప్రధానంగా జమీందారీ వ్యవస్థను అనాటి తెలంగాణ ప్రజల అవస్థలను తెలియజేస్తూ వచ్చింది. ఈ నాటకం పుస్తక రూపంలో తెచ్చిన 3నెలలకే 3000లకు పైగా పుస్తకాలు అమ్ముడుపోయాయి. అంటే ఆ నాటక ప్రభావం ప్రజలపై ఎంతవుందో అర్థం అవుతుంది. అంతటి ప్రాచుర్యం పొందిన నాటకం నిషేధానికి గురైంది. కారణం భూస్వాములకు వ్యతిరేకంగా ప్రజల చైతన్యవంతులుగా మార్చడానికి ప్రయత్నించడమే.

తెలంగాణ ప్రాంతం నాటికీ, నేటికీ పోరాట ప్రతీకగా, ఉద్యమాలకు పుటినిల్లు. భూమి కోసం, భుక్తి కోసం, తెలంగాణ విముక్తి కోసం ఎన్నో త్యాగాలు చేసింది. లాఠీలు, తూటాలను లెక్క చెయ్యకుండా జైలు గోడల్ని సైతం బద్దలకొట్టిన పోరాట స్ఫూర్తి తెలంగాణ ప్రజలది. ఎక్కడ అణచివేత, వివక్ష ఉంటుందో అక్కడ తిరుగుబాటు ఉంటుంది. కొన్ని దశాబ్దాలుగా తెలంగాణ సమాజం అణచివేత, పీడనకు గురైంది. వీటన్నింటిని అనుభవిస్తూనే ప్రతి సందర్భంలోను తననితాను ఆయుధంగా మార్చుకొని ఎదురుతిరిగింది. అలాంటి తెలంగాణ జీవితాన్ని కథా వస్తువుగా స్వీకరించి పురుడు పోసుకున్న నాటకమే ముందడుగు. ఇందులో జమీందారి వ్యతిరేకంగా ఉన్న వస్తువుతో రాసిన ఈ నాటకంలో తెలంగాణ ప్రజల జీవితం అవిష్కరిస్తూనే, ఆనాటి తెలంగాణ రైతుల పరిస్థితులను తెలియజేస్తూ వాటి ఆధారంగా తెలంగాణ ప్రజలు చైతన్యవంతులై నవసమాజం వైపు అడుగులు వేసిన అడుగులు వేసిన తీరును ముందడుగు నాటకం తెలియజేసింది.

ముందడుగు నాటక ఇతివృత్తంను తెలంగాణ ప్రాంతంలోని మారుమూల గ్రామమైన లక్ష్మీపురంలోని జమీందారీ ఠాణేదారు నాగేంద్రం కూలీవాళ్లపై ఆజమాయిషీ చెలాయిస్తున్న సన్నివేశంతో నాటకం ఆరంభం అవుతుంది. జమీందారులపై రైతులు చేసిన పోరాటానికి ప్రతీక ముందడుగు. రాచరిక వ్యవస్థకు వ్యతిరేకంగా సామాన్య జనం జరిపిన పోరాట ఫలితామే నాటకం అని చెప్పవచ్చు. జమీందార్ల అగడాలతో విసిగి, వేగి పోయిన కొంతమందితో ప్రారంభించి, అనాటి ఆగడాలను, మానవ సంబంధాలను చర్చించడం ఈ నాటకంలోని ప్రత్యేకత. వ్యక్తిగత జీవితంలోనే గాక, సామాజిక జీవితంలో ఎదురుయ్యే అనేక సంఘటనలకు పరిష్కార మార్గాన్ని చూపగలిగిన వ్యక్తిగా ఈ నాటక కథానాయకుడు నారాయణరావు కనిపిస్తాడు. నాటి తెలంగాణలోనే కాక దేశవాప్తంగా ఉన్న భూసమస్యలను, వెట్టిచాకిరిని వ్యతిరేకిస్తూ సాగిన సాయుధ పోరాటమే ఈ ప్రజా ఉద్యమం. అలాంటి నేపథ్యంలో వచ్చిన ఈ నాటకంలో ప్రజలందరు సంఘటితమై కుల, మత, లింగ తారతమ్యం లేకుండా కలసి ఒక సంఘంగా ఏర్పడి జమీందారి వ్యవస్థను సమూలంగా నాశసనం చేయడంతో ఈ నాటకం ముగుస్తుంది.

ముందడుగు నాటకం మొత్తం ఆనాటి తెలంగాణ ప్రాంతంలో జరిగినట్టి పరిస్థితులను రచయితలు కళ్ళకు కట్టినట్లుగా చిత్రికరించారు. భూస్వామ్య విధానం అమలులో ఉన్న కాలంలో జమీందారులు, రైతులు పంటలు పండించిన, పండించకపోయిన పన్నెండు శాతం అధికంగా పన్నులు వసూలు చేసేవారు భూస్వాములు. అంతే కాకుండా అనేక చిత్ర హింసలకు గురిచేస్తూ చివరకు పెండ్లాం మెళ్ళో పుస్తెలు కూడా తెగనమ్మి కట్టినట్లు కోటయ్య అనే రైతు మాటల వల్ల అర్థమవుతుంది. అయినా జమీందారు వినడు. అప్పోసప్పో చేసి శిస్తు కట్టినా రసీదులివ్వకుండా ముందరి సం॥రానికి చెందిన శిస్తును మళ్ళీ అడిగి క్రమంగా వసూలు చేసేవారు. రైతులను జమీందార్లు తమ ఇంట్లో పెండ్లైన, పండుగైన జలగల మాదిరిగా పీక్కు తినేవారు. తమ ఇంటి ఖర్చులను కూడా వారి చేత కట్టించేవారని పుల్లయ్య రైతు మాటల ద్వారా గ్రహించవచ్చు. అందరు రైతులు ఒకవైపు వుంటే, మరికొందరు జమీందారులకు తొత్తులుగా ఉంటూ అతనికి అడుగడుగున సహాయపడుతూ 'ఆ పెద్దమనిషి మాత్రం అంత అన్యాయనికి ఒడిగడతాడటరా 'అంటూ' అచ్చయ్య అనే ధనికరైతు జమీందారుకు మద్దతిస్తూ ఉంటాడు. జమీందార్లు తమ పబ్బం గడుపుకోవడానికి రైతులను కొంత మందిని ఎలాపెంచి పోషించారో ఈ నాటకం ద్వారా ప్రదర్శితమవుతుంది.

గ్రామంలోని ప్రజలందరు వెట్టి విధానంలో భాగంగా పటేల్, పట్వారీ, జమీందారి ఇళ్ళలో అనేక పనులు చేయడానికి ప్రతి ఇంటికి ఒకరు చొప్పున వంతుల వారీగా భూస్వాముల ఇళ్ళలో అనేక రకాల పనులను చేసేవారు. ఆ క్రమంలో తమ వృత్తికి సంబంధించిన పనులను ఏమాత్రం డబ్బులు ఇవ్వకుండా ఉచితంగా, నిరంతరంగా చేయించుకునే వారు భూస్వాములు, ఇలాంటి సందర్భంలో నారాయణను జమీందారు దగ్గర పని చేయమని తన తల్లి శాంతమ్మ కోరగా, అప్పుడు నారాయణ తల్లితో 'జమీందారు ఉద్యోగమా, పంటలు పండిన, ఎండినా దయాదాక్షిణాలు లేకుండా శిస్తులు వసూలు చెయ్యాలిగదా? పూటకు గంజికి గతిలేక అలో లక్ష్మణా అని అల్లాడే కూలీల చేత వెట్టిచాకిరి చేయించాలి గదా అని తల్లి వాపోతుంది. ఈ మాటల ద్వారా అనాటి ప్రజల పరిస్థితులను

సులువుగా అర్థం చేసుకోవచ్చు.

జమీందారులపై ప్రజలు తీవ్ర వ్యతిరేకతతో నిరసన పెల్లుబికింది. మూడవ అంకంలో కథానాయకుడు నారాయణరావు మాట్లాడుతూ "మనవాళ్ళంతా రాత్రింబగళ్ళు కష్టపడా పోట్టకు పట్టెడన్నం, కట్టుకోవడానికి గుడ్డలులేక నానా బాధాలు పడుతున్నం. అంతా కలిసిమెలిసి వుంటే ఈ జమీందార్ల, దురాగాతాలు, ఈ తాబేదార్ల లంచగొండితనాలు యిలా మితిమీరి పోతయా" (ముందడుగు: 1980:22) అంటూ అనాటి సామాజిక అంశాలపై ఆలోచించి ముందుకు వెళ్ళితే సమస్యకు పరిష్కార మార్గం దొరుకుతొందో, వివేకంతో మిగతా రైతుల, ప్రజల సహాయంతో ముందుకు కదలడం ఈ నాటకంలోని ప్రత్యేకం.

ఈ నాటకంలో నారాయణరావు ప్రజాస్వామిక భావాలు కల్గిన వ్యక్తి. ఇతను జమీందారు చేసే అగడాలను అడ్డుకోవడంతో ఇతన్ని మరియు పుల్లయ్యలను జైలుకు పంపిస్తాడు జమీందారు. ఆ సమయంలో వాళ్ళ అమ్మతో "ఒకళ్ళ నోటికాడి కూడుపడదోసినందుకు గాను, ప్రజల రక్తమాంసాలు పీల్చి పిప్పిచేసి కట్టుగుడ్డలతో నిలబెడుతున్న జమీందార్లను యిది మీక తగదయ్యా అని చెప్పినందు కమ్మ ఈ సంకెళ్ళు, అవసరం అయితే ఉరికంబం ఎక్కడానికైనా సిద్ధం, మీ శ్రమ ఫలితమే నన్నిట్టి వీరునిగా తయారుచేసిందని చెప్పడం వల్ల అనాడు అన్యాయ్యాన్ని ఎదిరించడం అంత సులువు కాదని", సామాన్య ప్రజలను కనీసం మనుష్యులుగా చూసే పరిస్థితి కూడా లేని తెలంగాణలో దాపురించింది.

తెలంగాణ స్త్రీలకు మాట్లాడడానికి, స్వేచ్ఛగా బ్రతకడానికి గల పరిస్థితులు లేవు. తీవ్ర అణచివేత అడుగడున కన్పిస్తుంది. పోరాట స్ఫూర్తి గల స్త్రీ శాంతమ్మ పాత్ర కన్పిస్తుంది. తెలంగాణ పోరాటానికి పాట. ప్రజలను చైతన్య వంతులుగా తీర్చిదిద్దడానికి పాట ఒక సాధనంగా ఉపయోగపడింది. అందుకే ఈ నాటకంలో పాట ప్రధాన పాత్రను పోషించింది. నాటకంలో విమల పాత్ర ద్వారా తెలంగాణలోని స్త్రీల పరిస్థితులను పాట రూపంలో వెల్లడించింది. సంఘంలో పేరుకు పోయిన దురాచారాలను నిరసిస్తూ వీరనారులు జన్మించిన ఈ ప్రాంతంలో కనీస హక్కులు అడగడానికి కూడా అవకాశం లేని పరిస్థితి. అలాంటి సందర్భంలో రచయితలు తమ వంతు కర్తవ్యంగా ప్రజలను చైతన్యవంతం చేస్తున్నారు. పోరాటతత్వం గలిగిన వీరు మీ హక్కులను అడగడానికి భయం ఎందుకు అంటూ ప్రజలలో నూతనోత్సాహన్ని నింపి వారిని 'ముందడుగు ' వేయించటం ఈ నాటకంలో చాలా స్పష్టంగా దృశ్యమాపంగా చిత్రీకరించబడింది. తెలంగాణ సమాజం ఎన్ని అవాంతరాలు ఎదురైన గుండె నిబ్బరంతో ముందడుగే వేసింది. దానికి ప్రతీకే ఈ ముందడుగు నాటకం.

**ముగింపు**

20వ శతాబ్దంలో వచ్చినట్టి ఆధునిక తెలంగాణ నాటకం పోరాటలతో, ఉద్యమాలతో పెనువేసుకపోయింది. ఇతర ప్రాంతంలో వచ్చిన నాటకాలకు, తెలంగాణ ప్రాంతంలో వచ్చిన నాటకాల మధ్య బేధం స్పష్టంగా కనిపిస్తుంది. తెలంగాణ నాటకంలో స్వీకరించిన వస్తువు తెలంగాణ సమాజంలోని వాస్తవికతను, జీవితాలను ఉన్నది ఉన్నట్లుగా చిత్రీకరించినవే అధికం. అందులో భాగంగా వెలువడిన ముందుడగు నాటకం నాటి సమాజంలోని పరిస్థితులను వాస్తవరూపం

ఇవ్వడంలోను, సామాన్య జనంలో చైతన్య విధానం, పోరాట స్ఫూర్తిని కలిగించిన తీరు మెచ్చుకొని తీరాల్సిందే. జమీందారి వ్యవస్థలో ఆనాటి తెలంగాణ ప్రజలు పడిన ఇతిబాధలను కళ్ళకు కట్టినట్లుగా కళ్ళముందుర కదులుతున్నట్లుగా చిత్రించింది ముందడుగు నాటకం. అనుకున్న లక్ష్యాన్నికి చేరుకోవాలంటే మధ్యలో ఎన్ని ఇబ్బందులు ఎదురైనా వాటిని పరిష్కరించుకుంటూ తన అస్తిత్వాన్ని కాపాడుకుంటూ ముందుకు నడవాలని సమాజానికి చక్కటి, చిక్కటి సందేశాన్ని అందించింది ఈ నాటకం.

ఉపయుక్త గ్రంథ సూచి

1. ముందడుగు నాటకం - వాసిరెడ్డి భాస్కరరావు, సత్యనారాయణ సుంకర,
   సుంకర శతజయంతి ముద్రణ - 2009, విజయవాడ.
2. తెలంగాణ పోరాట స్మృతులు-2011, ఆరుట్ల రామచంద్రారెడ్డి. కమలాదేవి ట్రస్ట్, హైదరాబాద్.
3. తెలంగాణ సాయుధ పోరాటచరిత్ర (1946-51), దేవులపల్లి వేంకటేశ్వరరావు.
4. తిరగబడ్డ తెలంగాణ - ఇనుకొండ తిరుమలి- 2010, హైదరాబాద్ బుక్‌ట్రస్ట్, హైదరాబాద్.
5. తెలంగాణవిమోచనోద్యమ నవలల్లో స్త్రీ చైతన్యం-2008, దేవకిదేవి తిరునగరి.
   తిరునగరి ప్రచురణలు, వికారాబాద్, 2008
6. తెలంగాణ సాయుధ పోరాటం నా అనుభావాలు-1987, నర్సయ్య దొడ్డి
7. వీర తెలంగాణ విప్లవ పోరాటం - పుల్లారెడ్డి చంద్ర.
8. వీర తెలంగాణ నా అనుభవాలు - జ్ఞాపకాలు - నారాయణరెడ్డి రావి.
   విశాలాంధ్ర పబ్లికేషన్. హైదరాబాద్.